యాచన అనగానే మూడురకాల బిచ్చ గాళ్ళు మాత్రమే ముందుగా మన దృష్టికొస్తారు. వీళ్లు 1. బియ్యపు బిచ్చగాళ్లు, 2. అన్నం బిచ్చగాళ్లు, 3. డబ్బుల బిచ్చ గాళ్లు.

వీళ్లు కాక వేరే బట్టల బిచ్చగాళ్లు, గడ్డి బిచ్చగాళ్లు, చెప్పుల బిచ్చగాళ్లు మొదలైన వాళ్లెందరో.

'రామచంద్ర పరబ్రహ్మణేనమః' అనిగానీ, 'భవతీ భిక్షాందేహి' అనిగానీ అడుక్కుంటే కొత్తేంకాదు. 'ఆ చేత్తోనే ఇలా పడెయ్యమ్మా' అనిగానీ 'ఇక్కడ మేమూ ఉన్నాం' అనిగానీ అడుక్కున్నా కొత్తేంకాదు. కానీ, మద్రాసులో బిచ్చగాళ్ళు మాత్రం నాకు కొంచెం వింత కలిగించారు. రేషనింగు రాకపూర్వం బియ్యానికి విపరీతంగా కటకట పడాల్సి వచ్చింది. ఒక




కాడో బిచ్చగాడు 'అమ్మా కాసిని నెల్లూరు బియ్యం పెట్టుతల్లీ' అంటూ వచ్చాడు మా ఇంటికి.

అసలే నెల్లూరు బియ్యం దొరకడం గగనంగా ఉండేది. అది కూడా మంచి బాలుడల్లే పేకువ జామునే లేచి, చెడ్డ బాలుడల్లే కాలకృత్యాలు, స్నానం కూడా మానేసి, వెళ్లి టి. యు. సి. యస్. వారి దుకాణం ముందు రైలాట ఆడితేను! ('రైలాట' అంటే క్యూలో నిలబడ్డం అని మీరు గ్రహించే ఉంటారు.)

నెల్లూరు బియ్యం ఖరీదెక్కువ. అందువల్ల బీద, బిక్కీకోసం, సరిపెట్టుకుపోయే వాళ్ల కోసం అప్రాచ్యదేశపు బియ్యం (అమెరికావి) దిగుమతి చేసి తక్కువ ధరల కమ్మేవారు. ఇవి మాత్రం పుష్కలంగా దొరికేవి. ఏ ఇంట్లో ఇవే వాడేవాళ్లం,

బియ్యం, కుళ్లుపళ్లు, 14క్యారట్ల బంగారం దానం చేస్తారటమ్మా" అని ధర్మ మాత్రాలతో గొప్పడి ముష్టి తీసుకోకుండానే వెళ్లిపోయాడు.

అయ్యా వీడు 'మీసాలకు సంపెంగ నూనె' రాచుకునే బాపతు.

మరోసారి మరో బిచ్చగాడు "అమ్మా బిచ్చం" అంటూ వచ్చాడు.

'బియ్యం నిండుకున్నాయి వెళ్ళు' అన్నాన్నేను.

వెంటనే వాడు "పక్కింటా యనిప్పుడే కొనుక్కొచ్చాడు బాబూ. వాళ్లింట్లో ఓ పడి అప్పు తీసుకోండి. కాసేపు నిలబడ్తానెండి ఫరవాలేదు" అంటూ శాంతంగా సలహా ఇచ్చాడు. ఇదేమన్నా బాగుందా చెప్పండి. వాడిని నాలుగూ చెరిగితేనేగాని వెళ్ళాడు కాడు.

మా శ్రీమతి గబగబా ఓ గుప్పెడు బియ్యం పట్టుకొచ్చింది వెయ్యడానికి.

"ఏమమ్మా బియ్యం చూపించండి" అన్నాడు బిచ్చగాడు ఆత్రంగా. మా శ్రీమతి బియ్యం చూపించింది.

బిచ్చగాడు మొహం ముడుచుకున్నాడు. పైగా.... "ఇదేవిటమ్మా ఈ అమెరికా బియ్యం గొడ్లు కూడా వాసన చూడవు. నెల్లూరు బియ్యం పెట్టమ్మా" అంటూ డబాయించాడు.

శ్రీమతికి కొంచెం కోప మొచ్చింది. "ఆఁ మరి నీ కోసం నెల్లూరు బియ్యం తెప్పించి పెడ్తా పాపం. ఇష్టమైతే జోలి పట్టు. లేకపోతే మానెయ్. మేం తినేవివే" అంటూ వెనక్కి తిరిగింది.

వాడు మాత్రం తక్కువ తిన్నాడా? "చాల్చాల్లేవమ్మా! ధర్మం చేసేప్పుడు చెత్త

ఇక అన్నం బిచ్చగాళ్లు!

"మాతా, అన్నపూర్ణేశ్వరీ! కాస్త అన్నముంటే పెట్టుతల్లీ" అంటూ వస్తుందో బిచ్చగత్తె.

"ఇంకా వంటకాలేదు. పద్దెన్న మేమీ మిగల్లేదు వెళ్ళు" అంటుంది ఓ ఇంటావిడ మాట వరసకి.

"వంటయ్యే దాకా ఉంటానమ్మా, వేడన్నమే పెట్టు" అంటుంది బిచ్చగత్తె నిబ్బరంగానే.

ఇంటావిడ కొంచెం చిక్కుల్లో పడుతుంది.

"సర్లే ఇక్కడే కూర్చోడ మెందుకు? అలా ఊళ్లోకి వెళ్లి 12 గంటలకు రా" అంటుంది.

అది సరిగ్గా 12 గంటలకే వచ్చి కూచుంటుంది చిత్ర మేమిటంటే అది ఈలోగా వాలోచోట అడుక్కోదు

ఓనాడు మా పక్కింటావిడ ఒక బిచ్చగాడికి అన్నం పెట్టింది కూరతో సహా. వాడు సంతోషంతో వెళ్ళి పోగూడదూ? అహ ఏదో గుణుస్తూ కూర్చున్నాడింకా.

"ఏవిట్రా ఇంకా కూర్చున్నావు? పో" అందావిడ.

"కొంచెం పెరిన నెయ్యి వెయ్యండమ్మా! బొత్తిగా గొడ్డుకూరెలా తినేది?" అన్నాడు వాడు తలొంచుకు నసుగుతూ.

అసలే నేతి ఖర్చుకు తట్టుకోలేక మానేయడమో, నువ్వుల నూనె, డాల్డాలు వాడుకోవడమో చేస్తూంటే వీడి కోరిక చూడండి

ఓ దీపావళినాడు అన్నం, పప్పు, కూరలు గార్లతో సహా పెడ్తే, ఓ బిచ్చగాడు అన్నం వంక, మా శ్రీమతి వంకా నాల్గుసార్లు పరకాయించి చూసి, "ఏమమ్మా పరమాన్నం పెట్టారు కాదు?" అని నిలదీసి అడిగాడు.

"మిగల్లేదబ్బాయ్" అంది శ్రీమతి.

"ఎంతున్నా మీ పొట్టలకే సాలదు" అని ఓ నిష్ఠూరం వేసి లేచిపోయాడు బిచ్చగాడు.

వాళ్లేం చెయ్యాలి చెప్పండి!

పోతే—డబ్బుల బిచ్చగాళ్లు.

వీళ్లు సాధారణంగా ఇళ్లకు రారు. బజార్లోనూ, బస్సుస్టాండుల్లోనూ, రైల్వే కంపార్ట్‌మెంటుల్లోనూ కిటకిట లాడ్తూంటారు.

"అయ్యా కళ్లులేని కబోదిని, ఓ పైసా దానం చెయ్యండి బాబూ" అనే గ్రుడ్డి వాళ్లూ,

"ఆహా భ్రమ్మ వశ్యం భోధమ్మంటే షిఖతేమిర అణ్ణాయా" అనే రైల్వే గాయక బిచ్చగాళ్లూ మనకు సుపరిచితులు.

కాని మద్రాసులో—

ఒకడు బస్‌స్టాండులో నిలబడుంటాడు. మనం వాణ్ణి సమీపించగానే వాడు తన చేతిలో ౨ పైసల నాణెం మనకు చూపిస్తూ "సార్ ఒక్క మూడు పైసలుంటే ఇస్తారా? బస్సుకు తక్కువయ్యాయి" అంటాడు. వీడెక్కడా మనకి బిచ్చగాడిలా కనిపించడు. చక్కగా క్రాఫింగు దువ్వుకుంటాడు. ఓ మాదిరి గుడ్డలు ధరిస్తాడు. వీలయితే చేతిలో ఓ ఎర్రరంగు నీళ్ల సీసా కూడా వుంటుంది. ఎందుకో తెలుసా? ఒకవేళ మనం వాడడిగిన దానం చెయ్యడానికి వెనకాడితే, తనకు జ్వరంగా వుందని తెలియజేసి, దాన్ని నిరూపించేందుకు తాసీసా కూడా చూపిస్తాడన్నమాట.

ఆ దెబ్బతో మనం బోలెడు జాలయిపోయి వాడికి మూడు పైసలూ దానంచేసి మన దోవనపోతాం. కాని వాడు మాత్రం బస్సెక్కడు. అక్కడేవుండి (భోజనవేళ దాకా) 'తన' అయిదు పైసల బిళ్లతోనూ బోలెడు వ్యాపారం చేసేస్తాడు.

మరోవాడు— మన దోవన మనం పోతూంటే మంచి పాంటూ షర్టూ వేసుకుని ఎదురుగా వచ్చి 'నమస్కారం బాబు గారూ' అంటాడు భక్తి వినయిస్తూ. ఇది ఎక్కువగా ఘనత వహించిన పాండీ బజార్లో జరుగుతుంది.


వాడెవడో మనకు తెలియకపోయినా, నాకు నమస్కారం పెట్టాడు గదా అని ఏవం కనీసం ఒక్క చిరుదరహాస చంద్రిక నైనా పారేస్తాం.

వాడు దగ్గిరకొచ్చేసి "బాబుగారూ ఓ పది పైసా లిప్పించండి మీ చేత్తో. నాకు కలిసొస్తుంది" అంటాడు చేయిజాపి.

"వాడికి కలిసొస్తుందట. మన చెయ్యి అంత మంచిదిగావన్ను" అని మనం కొద్దిగా గర్వపడి, కొంచెం తమాయించుకుని, తెలివిగల వాళ్లం గదా అని భ్రమించి, మరోసారి వాడి నోటివెంట అదేమాట వినాలని కుతూహలంగల వారమై, ప్రకాశంగా,

"నీ మొహం, నేనివ్వడమేమిటి? నీకు కలిసి రావడమేమిటి?" అనేస్తాం.

"అమ్మమ్మమ్మా అలా అనకండి సార్ మీ చెయ్యి విలువ మీకేం తెలుసు? నాక్క




తెలుసుగాని. మీకు జ్ఞాపకముందో లేదో... పోయినేడు సంవత్సరాది వాడు మీర్చు నాకో పావలా ఇచ్చారు. ఆ రోజున నాకు వంద రూపాయలు దొరికాయి మహాయోగంగా" అనేస్తాడు వాడు.

(మరి ఆ దొరకడం రోడ్డు మీద దొరికాయో, ఎవరి జేబులోనైనా దొరికాయో, లేకపోతే ఇలాగే అడుక్కుంటే దొరికాయో వాడికీ, దేవుడికీ మాత్రమే తెలియాలి.) పైగా వాడి కిదివరకు మనం ఇచ్చామో లేదో ఎవడికి జ్ఞాపకం? పొగడ్తలకు సాధారణంగా ఎవరైనా లొంగిపోవాల్సిందే గాబట్టి కొంచెం ముందూ వెనగ్గా లొంగిపోయి ఓ పావలా, లేక ఓ పది పైసలూ వాడి చేతిలో పెట్టి (అప్పయినా చేసి) నిష్క్రమిస్తాం మన హస్తవాసికి మురిసిపోతూ. అక్కడి నుంచీ వాడు మనకు త్రివిక్రముడై కనిపిస్తాడు. వారానికో సారి ఇదే పల్లవి పాడుతూ.

మరోరకం—పాండీబజార్లో పోతూంటే మన వెనక నుంచి 'సార్ సార్' అని వినిపిస్తుంది. మరి మనం బాగా ఇలాంటి వాటికి అలవాటు పడ్డ వాళ్లంగాబట్టి 'పోవయ్యా' అనో, 'చిల్లర్లేదు' అనో, లేకపోతే ఛీత్కరించుకుంటూనో పోతాం.

'సార్' తాలూకు అసామీ మనం అతణ్ణి డబ్బు అడుక్కునే వాణ్ణిగా భావించామని వాసన పట్టేసి, ముందుకొచ్చి కాళ్లు కడ్డంపడి

'సార్ నాకు డబ్బూ దస్కా మొద్దు సార్ రెండిడ్లీ ఒక కాఫీ చాలు" అంటాడు.

డబ్బయితే ఏదో ఇస్తాం— వదిలించుకుంటాం. కాని వీడి కోరిక తీరాలంటే 36 పైసలు కావాలే. అదీ ఇడ్లీన్నతో వెయ్యడక్కుండా వుంటేనూ. పోనీ గదా తిండిలేక ఇదైపోతున్నాడు అని మన పనున్నా కూడా మానుకుని వాణ్ణి హోటలుకు తీసికెళ్లమూ, వాడిష్టమొచ్చినవి ఆర్డరిస్తాడు. వాడితో అక్కడ వాదనేసుకుని అల్లరిపడ్డామా? పడం. ఓర్చుకుంటాం. కళ్లల్లో కోపంతో మనసులో దుఃఖంతో ఉహూ, ఇదైపోతాం. వాడసలివేవీ కనిపెట్టడు. వాడి పని వాడు చేసుకుపోతూంటాడు. దాంతో మనకి వైరాగ్యం పుడుతుంది. "వెధవ డబ్బు ఇంత ఖర్చు కాబోతూంటే మనం కూడా రెండిడ్లన్నతో బాటు కాఫీ సేవిస్తే తప్పేమిటి?" అని. వెంటనే మన కోరిక, లేక కసి తీరిపోతుంది. బయటపడేసరికి సాధారణంగా జేబు ఖాళీగానే వుంటుంది.

బయటపడ్డాక "సార్! చాలా థాంక్స్ సార్. నా ప్రాణం నిలబెట్టారు. వస్తా సార్ టైమైంది. కంచికి వెళ్లాలి" అనేసి గభాల్న అప్పుడే వచ్చిన బస్సెక్కి కంచి వెళ్లిపోతాడు. (కంచికేనా?)

మనం క్వశ్చన్‌మార్కు మొహంతో కాళ్లీడ్చుకుంటూ ఇంటికి వస్తాం. ●

